
సాక్షి
జగిత్యాల
శుక్రవారం । 24 । మార్చి । 2023



..మీరే సాక్షి

- 15 ఏళ్లుగా 'సాక్షి' అలుపెరగని పోరాటం
- అనేక సమస్యలకు పరిష్కారం
- మరెన్నో వెలుగులోకి తెచ్చిన వైనం
- నేడు 16వ వసంతంలోకి అడుగు

తెలుగు నేలపై చెరగని సంతకం 'సాక్షి'. పాఠకులను గుండెలకు హత్తుకుంటూ.. శుభోదయం చెబుతూ.. తన పయనం సాగిస్తోంది. వార్తలు.. వాస్తవాల ఆవిష్కరణలతోనే సామాజిక బాధ్యతలను భుజాన వేసుకుంది. 'సాక్షి' అక్షర సేద్యం మొదలై నేటితో పదిహేనేళ్లు పూర్తి. నిజాలను నిక్కచ్చిగా చెప్పడంలోనూ.. అభాగ్యులకు అండగా నిలవడంలోనూ ముందుంది. బాధితులకు అండగా నిలిచి బతుకుపై భరోసా కల్పించడంలోనూ నేనున్నానంటూ తోడుగా నిలబడింది. అవినీతి.. అక్రమాలపై అక్షర సమరం చేసింది. కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్న వారి దీనగాథలను ఆపన్నుల దృష్టికి తీసుకెళ్లి సాయం అందించడంలో తన చేయినందించింది. ప్రజల ఇబ్బందులపై అక్షరాలను ఆయుధాలుగా మలుచుకుని నిత్యం కథనాలు అందిస్తున్న 'సాక్షి'తో అనేక సమస్యలు పరిష్కారమయ్యాయి. అధికారుల స్పందనతో మరెన్నో ఇక్కట్లు తొలగాయి. సాక్షి పుట్టుక నుంచి వివిధ సమస్యలపై సాగించిన అక్షరపోరాటంలోని కొన్ని కథనాలు.. ప్రజలకు దూరమైన సమస్యలను ఒకసారి పరిశీలిస్తే..!!



న్యూస్‌రీల్

రైస్‌మిల్లుల్లో రాష్ట్ర విజిలెన్స్ అధికారుల తనిఖీ


తనిఖీ చేస్తున్న అధికారులు

జగిత్యాలరూరల్: జిల్లాలోని పలు రైస్‌మిల్లుల్లో గురువారం రాష్ట్ర విజిలెన్స్ టాస్క్‌ఫోర్స్ అధికారి ప్రభాకర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. వెల్గటూర్, జగిత్యాల రూరల్ మండలం సోమన్‌పల్లి, గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్‌తో పాటు జిల్లా కేంద్రంలోని పలు రైస్‌మిల్లుల్లో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. బియ్యం అప్పగింతలో జాప్యంతో పాటు ఈ నెల 31లోపు అప్పగించేలా చర్యలు చేపట్టాలని యజమానులకు సూచించారు. ఎఫ్ సీఐ అధికారి లక్ష్మారెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన ఉండాలి

జగిత్యాల: క్షయపై అందరికీ అవగాహన అవసరమని, జాగ్రత్తగా ఉండాలని డీఎంహెచ్‌వో పుప్పాల శ్రీధర్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ, ఈనెల 24న ప్రపంచ టీబీ దినోత్సవం జరుపుకుంటామని, సామాన్య ప్రజల్లో అవగాహన పెంచడం కోసం కార్యక్రమాలు సైతం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 17 మైక్రోస్కోపిక్ సెంటర్లను పట్టణ ప్రాథమిక సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటు చేయడం జరిగిందని, వీటిలో కఫం పరీక్షలు చేస్తారన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 1,903 కేసులు గుర్తించినట్లు వివరించారు. క్షయ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలకు 10 నామినేషన్లు

జగిత్యాలజోన్: ఈనెల 31న జరగనున్న జగిత్యాల బార్ అసోసియేషన్ ఎన్నికలకు గురువారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. తొలిరోజు 10 నామినేషన్లు దాఖలు కాగా, అధ్యక్ష పదవికి ఎర్ర నర్సయ్య, ప్రధాన కార్యదర్శి పదవికి చీటి రామకృష్ణారావు, సంయుక్త కార్యదర్శి పదవికి అందె మారుతి, జున్ను రాజేందర్, మహిళా కార్యదర్శి పదవికి పుప్పాల వనిత, గ్రంథాలయ కార్యదర్శి పదవికి కర్నె హరిదాసు నామినేషన్ దాఖలు చేశారు. కార్యవర్గ సభ్యుల పదవులకు పలువురు నామినేషన్లు వేశారు. నామినేషన్ల దాఖలుకు శుక్రవారంతో గడువు ముగుస్తుందని ఎన్నికల అధికారి టి.గంగాధరా ప్రసాద్, ఎన్నికల సహాయ అధికారి ఎన్. సంజీవ్‌రెడ్డి తెలిపారు.

ఒడిశా కార్మికులకు విముక్తి



మల్యాల(చొప్పదండి): 13 మంది ఒడిశా కార్మికులకు విముక్తి లభించింది. మల్యాల మండలం పోతారం గ్రామంలోని ఇటుక బట్టీ యజమాని బోదాసు తిరుపతి తమను నిర్బంధించి వేధిస్తున్నాడంటూ కార్మికుల ఫిర్యాదు మేరకు గురువారం సీఐడీ డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ఆర్.కృష్ణ, మల్యాల ఎస్సై చిరంజీవితో కలిసి ఇటుక బట్టీలకు వెళ్లి కార్మికులకు విముక్తి కలిగించారు. బోదాసు తిరుపతి, సూపర్‌వైజర్ బక్కశెట్టి రాకేశ్ వేతనాలు చెల్లించకుండా, బలవంతంగా పనిచేయించుకుంటూ బెదిరిస్తున్నారు. కాగా కార్మికులను ఒడిశాలోని తమ స్వస్థలాలకు పంపించారు. తిరుపతి, రాకేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఫ్లోరైడ్ రక్కసిపై పోరు


ఫ్లోరైడ్ పీడకు విరుగుడు

గొల్లపల్లి(ధర్మపురి): గొల్లపల్లి మండల కేంద్రానికి కిలోమీటర్ దూరం కూడా లేని ఊరు గుంజపడుగు. ఈ గ్రామస్తులు కొన్నేళ్లుగా ఫ్లోరైడ్ నీటితో ఇబ్బందిపడుతున్నారు. ఆ నీటిని తాగి జీవశ్చవాలుగా, వికలాంగులుగా, కిడ్నీ, కీళ్ల నొప్పుల బారిన పడి అల్లాడుతున్నారు. వారి బాధలు కళ్లకు కట్టేలా 'సాక్షి'లో 'కబలిస్తున్న ఫ్లోరైడ్ రక్కసి' శీర్షికన కథనం ప్రచురితమైంది. అయినా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించలేదు. కానీ.. ఓ వైద్యుడు చలించిపోయాడు. జగిత్యాలకు చెందిన వైద్యుడు ఎల్లాల శ్రీనివాస్‌రెడ్డి గ్రామస్తుల బాధలు నేరుగా చూసి ఫ్లోరైడ్ రహిత నీటిని అందిస్తానని హామీ ఇచ్చాడు. ఓ స్వచ్ఛంద సేవ సంస్థతో కలిసి తనవంతు ఆర్థికసాయం అందజేశాడు. మూడునెలల్లో పనులు పూర్తి చేయించి వాటర్ ప్లాంట్ ప్రారంభించారు.

'సాక్షి'కి ధన్యవాదాలు



మా గ్రామంలో ఉన్న సమస్యలను 'సాక్షి' వెలుగులోకి తీసుకువచ్చింది. ప్రధానంగా ఫ్లోరైడ్ సమస్యపై కథనం రాయగా ఎల్లాల శ్రీనివాస్‌రెడ్డి సారు స్పందించి వాటర్ ప్లాంట్‌కు ఆర్థికసాయం చేశారు. ఇప్పుడు ఆ నీళ్లే తాగుతున్నాం. మా గ్రామస్తుల తరఫున 'సాక్షి'కి ధన్యవాదాలు.

– అంజి, గుంజపడుగు

ప్రాణం పోసిన 'సాక్షి'


పేద కళాకారుడికి 'పుట్టెడు కష్టం'

వీణవంక: తెలంగాణ ఉద్యమ సమయంలో ధూంధాం కళాకారులతో కలిసి ఆటపాటలతో ఉర్రూతలూగించిన వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గోనెల రమేశ్‌కు మెదడులో రక్తస్రావం జరిగింది. ఆపరేషన్‌కు రూ.13 లక్షలు అవసరం అయ్యాయి. కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. అప్పు పుట్టే పరిస్థితి లేదు. ఆపరేషన్ చేయించే స్థోమత లేదు. ఈ క్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు 'సాక్షి'ని ఆశ్రయించారు. 2019 సెప్టెంబర్ 21న సాక్షిలో 'పేద కళాకారుడికి పుట్టెడు కష్టం' శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దేశవిదేశాల నుంచి దాతలు స్పందించారు. రూ.10 లక్షలకు పైగా సమకూరాయి. ఆపరేషన్ చేసుకున్న రమేశ్ ఇప్పుడు కుటుంబంతో జీవిస్తున్నాడు.

బతుకుత అనుకోలే..



ధూంధాం కళాబృందంలో పోతురాజు వేషం వేసేవాడిని. హఠాత్తుగా మెదడులో రక్తస్రావమై పక్షవాతం వచ్చింది. ఆస్పత్రిలో చేరితే రూ.13లక్షలు అవుతాయని వైద్యులు చెప్పారు. నా భార్య రజిత దిక్కుతోచని స్థితిలో పడింది. ఇక బతుకు అనుకున్న. ఇంతలో మా ఊరోళ్లు 'సాక్షి'ని సంప్రదించుమని చెప్పారు. నా గురించి 'సాక్షి'లో రాశారు. రూ.10 లక్షలకు పైగా దాతలనుంచి సాయం వచ్చింది. ఆపరేషన్ అయ్యింది. 'సాక్షి' నాకు ప్రాణం పోసింది. లేకుంటే బతికెటోన్ని కాదు.

– గోనెల రమేశ్, మల్లారెడ్డిపల్లి

'సాక్షి' కథనంతో చిన్నారులు భద్రం


తల్లుల ఒడికి చిన్నారులు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఈ ఏడాది ఫిబ్రవరిలో కరీంనగర్‌లోని మంకమ్మతోటలో ఇంటి ఎదుట ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులు కాదాసి అక్షిత (11), మిడిదొడ్డి లోకేశ్ (09)ను అదే కాలనీలో నివసించే మహిళ చాక్లెట్ల ఆశచూపి కిడ్నాప్ చేసింది. చిన్నారులను కరీంనగర్ రైల్వే స్టేషన్ నుంచి ఔరంగాబాద్‌కు తీసుకెళ్లింది. రైలులో పిల్లలు ఏడుస్తున్నారని రక్తం వచ్చేలా చితకబాదింది. ఔరంగాబాద్ చేరుకోగానే పిల్లల గాయాలు చూసిన పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని కరీంనగర్‌లోని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. చిన్నారుల తల్లిదండ్రుల ఇద్దరు నిరక్షరాస్యులు కావడంతో భాష సమస్య తలెత్తింది. వెంటనే రంగంలోకి దిగిన 'సాక్షి' అధికారులు, తల్లిదండ్రుల మధ్య సంధానకర్తగా వ్యవహరించింది. పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించే న్యాయ ప్రక్రియలో రెండురోజుల పాటు దుబాసీగా వ్యవహరించింది. ఫలితంగా అక్కడి అధికారులు పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించారు. ఆ తరువాత చిన్నారులు క్షేమంగా కరీంనగర్‌కు చేరుకున్నారు. ఓ వైపు చిన్నారుల తల్లిదండ్రులకు సహాయపడుతూనే మరోవైపు ఈ కిడ్నాప్ ఉదాంతం వరుస కథనాల ప్రచురించింది. దీంతో స్పందించిన పోలీసులు మహిళపై కిడ్నాప్ కేసు నమోదు చేశారు.

'సాక్షి' కన్నపేగును కాపాడింది



మా పిల్లలను పొరుగింటి మహిళ కిడ్నాప్ చేసిందని వెంటనే గుండె ఆగినంత పనైంది. అభం శుభం తెలియని చిన్నారులు మహారాష్ట్ర రైల్వే పోలీసులకు చిక్కారని తెలియగానే కంగారు పడ్డాం. కానీ 'సాక్షి ప్రతినిధి' మాకు మహారాష్ట్ర చిల్డ్రన్ ప్రొటెక్షన్ అధికారులకు మధ్యగా సంధానకర్తగా వ్యవహరించి పిల్లలను క్షేమంగా విడిపించారు. 'సాక్షి' కథనాలతో పోలీసులు కిడ్నాప్‌నకు పాల్పడిన మహిళపై కేసు పెట్టారు. సాక్షి చొరవే మా కన్నపేగును కాపాడింది.

– సరిత, చిన్నారి తల్లి

ఇటుకబట్టీల్లో అక్షరవెలుగు


బట్టీల్లో మొక్కు'బడి'..!

సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా అంటే ఇటుక బట్టీలకు కేరాఫ్. ఆయా ఇటుక బట్టీల్లో పనిచేసే వలస కార్మికుల పిల్లల చదువులపై 'బట్టీల్లో మొక్కుబడి'..?' శీర్షికన వారి సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో అప్పటి డీసీపీ రూపేష్ స్పందించి 'ఆపరేషన్ ధృవ' పేరుతో ఇటుకబట్టీల్లో డిజిటల్ పాఠశాలలు ఏర్పాటు చేశారు. అలాగే ప్రతి ఇటుక బట్టీల్లో వారి ప్రాంతానికి చెందిన టీచర్లతో విద్యాబోధన జరిగేలా చర్యలు తీసుకున్నారు.


మా పిల్లలు చదువుకుంటున్నారు



ఉపాధికోసం ఒడిశా నుంచి వలస వచ్చి భార్యపిల్లలతో సుల్తానాబాద్ ఇటుకబట్టీలో పనిచేస్తున్నాం. పిల్లల చదువు గురించి పెద్దగా పట్టించుకోలేదు. 'సాక్షి' పేపర్‌లో మా వలస కార్మికుల పిల్లల చదువులపై రాసింద్రు అని అప్పటి డీసీపీ సారు బట్టీల్లో స్కూళ్లు ఏర్పాటు చేయించిండు. ఇప్పుడు మా పిల్లలతో పాటు మిగితా పిల్లలు పనిలోకి రాకుండా బడికిపోయి చదువుకుంటున్నారు.

– తులసీరాంనాగ్, వలస కార్మికుడు

మంథని సమస్య.. జిల్లావ్యాప్తంగా పరిష్కారం



మంథని: పొలాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలతో అన్నదాతలు ఇబ్బంది పడ్డారు.ఈ స్తంభాల పరిస్థితిపై 2010 జూన్, జూలై మాసాల్లో 'సాక్షి' వరుస కథనాలిచ్చింది. ఎన్‌పీడీసీఎల్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లింది.అప్పటి మంథని డీఈఈ ఈశ్వరప్రసాద్ ఉన్నతాధికారులకు నివేదించారు. ఒరిగిన స్తంభాలను సరిచేసే కార్యక్రమానికి 2013మార్చి 22న శ్రీకారం చుట్టారు. పనులను ఎస్‌ఈ రాంమోహన్‌రావు పరిశీలించి సమస్య ఉన్నచోట జిల్లాలోని అన్ని ప్రాంతాలకు విస్తరించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నూతనంగా 47 వేల స్తంభాలు అమర్చారు.

మెప్మా కుంభకోణంపై చర్యలు

కరీంనగర్ సిటీ: కరీంనగర్ నగర పాలక సంస్థ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో నకిలీ సంఘాలను సృష్టించి కోట్లాది రూపాయలు రుణాలు తీసుకుని సొంతఖాతాలోకి మళ్లించుకున్న వైనంపై సాక్షిలో వరుస కథనాలు ప్రచురించాం. దీనిపై స్పందించిన అధికారులు విచారణకు ఆదేశించారు. వీటితో పాటు నకిలీ సంఘాల పేరుతో రుణాలు తీసుకున్న వారిపై పోలీస్‌స్టేషన్ కేసు నమోదు చేశారు. ఈ కుంభకోణంలో పాలు పంచుకున్న వారిని మెప్మా నుంచి తొలగించారు.

దళితులపై పోలీసుల థర్డ్ డిగ్రీ

సిరిసిల్ల: తంగళ్లపల్లి మండలం నేరెళ్ల దళితులపై పోలీసులు 2017 జూలై 14న థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. ఈ ఘటనపై 'సాక్షి' 'దళితులపై థర్డ్ డిగ్రీ' అనే కథనాన్ని ప్రచురించింది. జిల్లెల్ల వద్ద జూలై 2న ఇసుక లారీ ఢీకొని బదనపురం భూమయ్య మరణించాడు. గతంలో ఇలాంటి ఘటనలు జరగడంతో ఆగ్రహించిన స్థానికులు ఐదు ఇసుక లారీలకు నిప్పు పెట్టారు. ఈ ఘటనలో 13 మందిపై కేసు పెట్టిన పోలీసులు పెంట బానయ్య, కోల హరీశ్, చెప్యాల బాలరాజు, పసుల ఈశ్వర్, గంధం గోపాల్, బత్తుల మహేశ్‌ను నిర్బంధించిన థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. దీనిపై 'సాక్షి'లో కథనం రావడంతో పార్లమెంట్ స్పీకర్ మీరాకుమార్, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ నేరెళ్లకు వచ్చి బాధితులను పరామర్శించారు. అన్ని రాజకీయ పార్టీల నేతలు నేరెళ్లకు వచ్చారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై రవీందర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఎస్పీ విశ్వజిత్ కంపాటిని బదిలీ చేశారు.

'సాక్షి' ఫొటో కుటుంబాన్ని కలిపింది

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడూరుకు చెందిన మినప ఎల్లయ్య 2006లో దుబాయ్ వెళ్లేందుకు రూ.50వేలు అప్పు చేసి ఏజెంట్ చేతిలో పెట్టి మోసపోయాడు. స్వగ్రామానికి రావడం ఇష్టం లేక వెంకటాపూర్‌లోని కూతురు వద్దకు వెళ్లాడు. ఒకరోజు కనిపించకుండా పోయాడు. భార్య కేశవ్వ, కుమారులు దేవరాజు, శ్రీనివాస్ బంధువుల ఇళ్లు, తెలిసిన చోట ఏడాదిపాటు వెతికినా.. ఆచూకీ లభించలేదు. 2009 మార్చిలో నిజామాబాద్ జిల్లా వర్ని నుంచి వ్యవసాయ కూలీలకు సంబంధించిన కథనం 'సాక్షి'లో ప్రచురితమైంది. సాక్షిలో వచ్చిన ఫొటోను గూడూరు సర్పంచ్ చీటి వెంకటనర్సింగారావు చూశారు. ఆయనను ఎల్లయ్యగా గుర్తించి ఆయనకు వైద్యం చేయించి స్వగ్రామానికి తీసుకొచ్చారు. 'సాక్షి' దినపత్రికలో కథనంతో ఇంటి పెద్దదిక్కును కుటుంబ సభ్యుల చెంతకు చేర్చింది. తమ కుటుంబ పెద్దను తమ వద్దకు చేర్చిన సాక్షికి జీవితాంతం రుణపడి ఉంటామని ఎల్లయ్య భార్య కేశవ్వ, కుమారులు దేవరాజు, శ్రీనివాస్ పేర్కొన్నారు.


కొడుకు కోడలు, మనుమడితో ఎల్లయ్య

బొమ్మలమ్మగుట్టకు తప్పిన గ్రానైట్ గండం

గంగాధర: శతాబ్దాల చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తున్న గంగాధర మండలంలోని కురిక్యాల, కొండన్నపల్లి గ్రామశివారులోని బొమ్మలమ్మగుట్టపై 13ఏళ్ల క్రితం గ్రానైట్ వ్యాపారులు కన్ను వేశారు. దాదాపు 9 మంది వ్యాపారులు గ్రానైట్ రాయి తీసుకెళ్లడానికి దరఖాస్తు చేసుకున్నారు. మామూళ్లకు అలవాటు పడ్డ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా గ్రానైట్‌క్వారీల ఏర్పాటుకు అనుమతి ఇచ్చేందుకు సిద్ధం అయ్యారు. ఈ విషయమై గ్రానైట్ తీయవద్దని కురిక్యాల, కొండన్నపల్లి యువకులు బొమ్మలమ్మగుట్ట చరిత్రను వివరిస్తూ పురావస్తు, పర్యాటక, మైనింగ్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వినూత్న నిరసనలకు కర్ణాటక ప్రభుత్వం సైతం మద్దతిచ్చింది. అప్పుడే పురుడు పోసుకున్న 'సాక్షి' దినపత్రిక గుట్ట చరిత్రపై వరుస కథనాలు ప్రచురించింది. ప్రభుత్వం సైతం పర్యాటకప్రాంతంగా గుర్తించింది. ఇందుకు సంబంధించిన జీవో నంబరు 13/2011 విడుదల చేసింది.

'సాక్షి'కి సలాం



బొమ్మలమ్మగుట్ట గ్రానైట్ వ్యాపారుల పరం కాకుండా ఉండటానికి 'సాక్షి' వరుస కథనాలు ఇచ్చింది. అవే మా ఉద్యమానికి ఊపిరయ్యాయి. ఎట్టకేలకు స్పందించిన ప్రభుత్వం గ్రానైట్ వ్యాపారుల దరఖాస్తును రద్దు చేసింది. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని చాలాబాగా అభివృద్ధి చేస్తున్నారు.

– లింగయ్య, బొమ్మలమ్మగుట్ట పరిరక్షణ, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు

బొగ్గుదందాకు చెక్

సాక్షి, పెద్దపల్లి: గోదావరిఖనిలో సింగరేణి నుంచి అక్రమంగా బొగ్గు రవాణాపై '100 కోట్ల బొగ్గుదందా' శీర్షికన 2016లో మొదటిసారిగా వెలుగులోకి తీసుకొచ్చింది.దందా సాగుతున్న వైనం, అందులో ఉన్న దళారులపై వరుస కథనాలు ప్రచురించింది. అప్పటి ఎస్పీ వారియర్ స్పందించి బొగ్గుదందాపై ఉక్కుపాదం మోపి సింగరేణికి నష్టం వాటిల్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. అప్పటి నుంచి దందాకు చెక్ పడింది.

క్రీడారంగానికి దిక్సూచి

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ క్రీడారంగానికి 'సాక్షి' దిక్సూచిగా మారింది. 15 ఏళ్లుగా క్రీడారంగంలో ప్రారంభం కాని ఎన్నో కార్యక్రమాలకు 'సాక్షి' కథనాలు ముందడుగు వేశాయి. 2005లో అంబేద్కర్ స్టేడియంలో తాత్కాలికంగా ప్రారంభించిన ప్రాంతీయ క్రీడాపాఠశాలను 2019లో లోయర్ మానేరు కిందకు సొంత భవనాల్లోకి మారడంలో 'సాక్షి' కథనాలే ప్రధాన కారణం.2020లో కరీంనగర్‌కు మంజూరైన సెట్విన్ సెంటర్‌ను రెండేళ్లకు 'సాక్షి' కథనంతో ప్రారంభించారు. దీంతో వేలాది మంది యువతకు శిక్షణ కల్పించినట్లయ్యింది.

ధైర్యం కోల్పోకండి.. ఆదుకుంటాం!

- జిల్లా రైతులకు సీఎం కేసీఆర్ భరోసా
- అండగా ఉండాలని వేడుకున్న రామడుగు రైతులు
- ప్రతీ ఎకరాకు రూ.10వేలు ఇస్తామని సీఎం ప్రకటన
- జిల్లాలో దాదాపు 23వేల ఎకరాలకు.. రూ.23 కోట్ల పరిహారం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/రామడుగు: అకాల వర్షాల వల్ల పంటలు కోల్పోయిన రైతులెవరూ అధైర్యపడవద్దని సీఎం కేసీఆర్ అన్నారు. వరంగల్ నుంచి నేరుగా రామడుగు లక్ష్మీ పంప్‌హౌజ్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద సీఎం దిగారు. అక్కడ నుంచి లక్ష్మీపూర్, రామచంద్రపూర్‌లో పర్యటించారు. లక్ష్మీపూర్‌లో రైతు దేవా రామచంద్రారెడ్డి వేసిన మస్క్ మిలాన్, డ్రాగన్‌ఫ్రూట్ పంట నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు ముఖ్యమంత్రితో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో తమ ప్రాంతంలో తీవ్ర కరువు, కాటకాలు ఉండేవని, ఎన్ని బోర్లు వేసినా నీళ్లు పడేటివి కాదని గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు పుష్కలమైన నీటి సదుపాయాలు సమకూరడంతో భూగర్భ జలాలు దండిగా పెరిగాయన్నారు. కేవలం 8 నుంచి 10 మీటర్ల లోతులో నీరు వస్తుందన్నారు. కరెంటు, నీరు విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారు. ఈసారి పంట నష్టంపోయి తనకు దాదాపు నష్టం వచ్చినా.. తానేం అధైర్యపడడం లేదని అన్నారు. 'సీఎం సార్ మీరే మా ధైర్యం దయచేసి మమ్మల్ని ఆదుకోండి సార్' అని రైతు వేడుకున్నాడు. అనంతరం సీఎం సమీపంలోని మామిడి రైతు ఎడవెల్లి రాజిరెడ్డి తోటకు వెళ్లారు. రాలిపోయిన మామిడి నష్టంపై ఆరా తీశారు. అనంతరం రైతువేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు.

ఎడారి, వలసల ప్రాంతం

సమైక్యపాలనలో రాష్ట్రంలో ఎక్కడ చూసినా కరువు కాటకాలు ఉన్నాయని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. చొప్పదండి ప్రాంతం కూడా ఎడారిలా ఉండేదని, రైతులంతా బతుకుదెరువుకోసం వలసలు వెళ్లేవారని గుర్తుచేశారు. అందుకే, కాళేశ్వరం ప్రాజెక్టు కట్టుకుని, కాలువలు నిర్మించుకుని ఆ ప్రాంతాన్ని పచ్చగా చేసుకున్నామన్నారు. తాను వస్తుంటే లక్ష్మీ పంప్ హౌజ్ కాలువలకు రైతులు పెట్టుకున్న మోటార్ల పంపులు చూసి సంతోషించామన్నారు. వీటి ద్వారా కాలువకు ఎగువ నేలల్లో ఉన్న పంటలకు సైతం నీరందుతోందని హర్షం వ్యక్తం చేశారు. తమది రైతు సంక్షేమ ప్రభుత్వమని అందుకే, నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకుంటామన్నారు. ఎకరాకు రూ.10వేల చొప్పున పంట సాయం ప్రకటించారు. కాగా జిల్లాలో దాదాపు 23వేల ఎకరాల్లో పంట నష్టం జరగగా.. రూ.23 కోట్ల మేరకు నష్టపరిహారం అందనుంది. కాగా.. వడగండ్ల వర్షంతో లక్షలాది రుపాయల పంటలు నష్టపోతే సీఎం కేసీఆర్ ఎకరాకు రూ.పదివేలు పరిహారం అందజేస్తామని ప్రకటించడంపై అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, మంత్రులు గంగుల కమలాకర్, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, దాసరి మనోహర్‌రెడ్డి, సీఎస్ శాంతి కుమార్, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, కలెక్టర్ కర్ణణ్, సీపీ సుబ్బారాయుడు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.


దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, చిత్రంలో మంత్రులు, అధికారులు

పోలీసులపై మంత్రి అసహనం..

సీఎం పర్యటన సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ పోలీసులపై అసహనం ప్రదర్శించారు. సీఎం పర్యటనకు ముందుగానే మధ్యాహ్నం మంత్రి గంగుల కాన్వాయ్ రామడుగు చేరుకుంది. అయితే, గంగుల కాన్వాయ్‌కు దారి చూపేందుకు పైలెట్ వాహనం రాలేదు. ఈ విషయం పోలీసులకు తెలిపినా.. వారు వాహనం సమకూర్చలేకపోయారు. పంప్‌హౌజ్ గెస్ట్ హౌజ్ చేరుకున్నాక.. మంత్రి రామడుగు పోలీసులపైన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

సత్యరాజ్ వర్మకు పరామర్శ


సత్యరాజ్‌వర్మను పరామర్శిస్తున్న నాయకులు

మల్యాల: ఈనెల 19న వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల సిరిసిల్ల పర్యటనలో చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ సత్యరాజ్ వర్మ అస్వస్థతకు గురై, ఆస్పత్రిలో చికిత్స పొందారు. కాగా జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, వివిధ మండలాలకు చెందిన వైఎస్సార్‌టీపీ అధ్యక్షులు గురువారం ఆయన స్వగృహంలో పరామర్శించారు. ఇక్కడ జగిత్యాల నియోజకవర్గవై వైఎస్సార్‌టీపీ ఇన్‌చార్జి కాముని గంగాధర్, ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి జాడి ప్రేమ్‌సాగర్, హైకోర్టు న్యాయవాదులు ఎడపెల్లి భూమేశ్, మేక అంజయ్య, దళిత సంఘ నాయకులు కల్లెపల్లి రమేశ్, గంగాధర మండల పార్టీ అధ్యక్షుడు అత్తాపురం తిరుపతి, కొడిమ్యాల మండలాధ్యక్షుడు అరుణ్‌కుమార్ తదితరులున్నారు.

నాణ్యత లేని వస్తువులు విక్రయించొద్దు


వ్యాపారస్తులతో మాట్లాడుతున్న చందన్‌కుమార్

జగిత్యాలరూరల్: నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉంచాలని, నాణ్యత లేని వస్తువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయంలో రంజాన్ పండగ పురస్కరించుకుని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, కార్యదర్శులు, సూపర్‌మార్కెట్ అసోసియేషన్, కిరాణం మార్కెట్ అసోసియేషన్, నాన్‌ట్రేడర్స్ అసోసియేషన్, వంటనూనె డీలర్స్, ఆనియన్ మర్చంట్ అసోసియేషన్ నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో పప్పు నిల్వలు, నూనె, బియ్యం, నిత్యావసర వస్తువుల నిల్వలు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రస్తుతం ఉన్న ధరల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో కృత్రిమ కొరత సృష్టించొద్దని, ధరలు పెంచినా, నాణ్యత లేని వస్తువులు అమ్మినా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కమటాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఒకరికి గాయాలు

ధర్మపురి : కుక్కల దాడిలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మపురికి చెందిన పాలెపు ప్రసాద్ బుధవారం రాత్రి తన ఇంటిముందు కూర్చున్నాడు. ఒక్కసారిగా వీధికుక్కలు అతనిపై దాడిచేయడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించారు. కుక్క కాటుకు ధర్మపురి ఆస్పత్రిలో చికిత్స అందడం లేదని సోషల్ మీడియాలో వైరల్ అయింది. వైద్యుడు నవీన్‌ను వివరణ కోరగా ఆస్పత్రిలో 24 గంటలు వైద్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. గాయపడిన వ్యక్తికి చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు.


గాయపడిన ప్రసాద్

కూలీల కొరతకు చెక్

- ఆధునిక యంత్రాల వైపు అన్నదాతలు
- 'చెరుకు కట్టింగ్ మిషన్'తో సమయం, ఖర్చు, ఆదా
- అంతర్గాంలో వినియోగిస్తున్న రైతులు


అంతర్గాంలో చెరుకు గడలను కట్ చేస్తున్న మిషన్

జగిత్యాల అగ్రికల్చర్ : వ్యవసాయ పనులకు కూలీల కొరత రైతులకు సమస్యగా మారింది. దీంతో అన్నదాతల చూపు ఆధునిక యంత్రాల వైపు మళ్లుతోంది. ఖర్చు ఎంతయినా యంత్రాలను కిరాయికి తెప్పించుకొని పనులు చేయిస్తున్నారు. చెరుకును కట్ చేసేందుకు కూలీలు దొరక్కపోవడంతో రైతులు ఖమ్మం జిల్లా నుంచి చెరుకు నరికే మిషన్‌ను తెప్పించి జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాంలో వినియోగిస్తున్నారు.

వెయ్యి ఎకరాల్లో సాగు..

మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ ఏర్పాటైన నుంచి రైతులు చెరుకు పంటను సాగు చేస్తున్నారు. జిల్లాలో దాదాపు వెయ్యి ఎకరాల్లో చెరుకును రైతులు సాగుచేయగా కామారెడ్డిలోని ప్రైవేట్ ఫ్యాక్టరీకి పంపిస్తున్నారు. ఓ వైపు చెరుకు గడలను కట్ చేసేందుకు కూలీలు, మరోవైపు రవాణా సమస్య, పెరుగుతున్న ఖర్చులు రైతులకు కష్టంగా మారాయి.

రైతులకు తిప్పలు..

ప్రస్తుతం చెరుకు పంట కాలం పూర్తయి మూడునెలలు గడుస్తున్నా కట్ చేసే పరిస్థితి లేదు. ఫ్యాక్టరీని ఈనెల 25న మూసివేస్తున్నట్లు ప్రకటించారు. కాగా నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు చెరుకును కట్ చేయాల్సి ఉన్నా ఆలస్యం కావడంతో దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కూలీలు దొరక్కపోవడంతో మహారాష్ట్ర, తదితర ప్రాంతాల నుంచి వచ్చే కూలీలు అడ్వాన్సులు తీసుకొని తిరిగి వెళ్లిపోతున్నారు.

ఒకేరోజు వంద టన్నుల కటింగ్..

అధునాతన యంత్రంతో ఒకేరోజు వందటన్నుల చెరుకును కట్ చేయొచ్చు. యంత్రానికి ఉన్న పదునైన బ్లేడ్లతో కట్ చేసి, ప్రత్యేక గొట్టం ద్వారా గడలను పైకి పంపిస్తుంది. గంటకు 15 కి.మీ వేగంతో యంత్రం నడుస్తుంది. టన్నుకు ఫ్యాక్టరీ ఇచ్చే కిరాయి కాకుండా రైతుల నుంచి రూ.600 వరకు తీసుకుంటున్నారు. మిషన్ ధర దాదాపు రూ.95 లక్షల వరకు ఉంటుంది. తరుగుపేరుతో 6 శాతం కట్ చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

కూలీలు దొరకడం లేదు



చెరుకును కట్ చేసేందుకు కూలీలు దొరకడం లేదు. వరి వేయకుండా చెరుకు పంట వేస్తే కూలీల సమస్య ఉంది. ఇప్పటికే చెరుకును కట్ చేయాల్సి ఉన్నా.. ఆలస్యం కావడంతో యంత్రంతో చెరుకును కట్ చేయిస్తున్నాం.

– వామన్, చెరుకు రైతు, అంతర్గాం

ఒకేరోజు పూర్తి



ఇంతకుముందు కూలీలతో చెరుకు కట్ చేసేందుకు వారం రోజులు పట్టేది. ఇప్పుడు యంత్రం అందుబాటులోకి రావడంతో ఒకేరోజు పూర్తవుతుంది. దీంతో సమయం ఆదా కావడంతో పాటు ఖర్చుకూడా తగ్గుతుంది.

– నోముల శేఖర్, అంతర్గాం

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ స్కూళ్లు

- మంత్రి కొప్పుల ఈశ్వర్


రాఘవపట్నంలో పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఈశ్వర్

గొల్లపల్లి(ధర్మపురి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు– మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా నిలువనున్నాయని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలంలోని రాఘవపట్నం, చెందోళి గ్రామాల్లో మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.52.67 లక్షలతో చేపట్టిన పలు భవనాలను గురువారం ప్రారంభించారు. అనంతరం రూ.77 లక్షలతో గంగాదేవి పల్లె నుంచి మొగుల్ల చెరువు వరకు బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చెందోళిలో రూ.1.22 కోట్లతో నిర్మించిన పాఠశాల భవనం ప్రారంభించారు. అంతకుముందు తిరుమలాపూర్‌లో గుండు మల్లన్న జాతర మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పాఠశాలల్లో మౌలికవసతుల కల్పనతో పాటు నాణ్యమైన విద్య అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు– మన బడి కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మంద మకరంద్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామానికి మృతదేహం

- గుండెపోటుతో ఏడురోజుల క్రితం దుబాయిలో మృతి
- మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదనలు


రాజరెడ్డి (ఫైల్)

మల్లాపూర్ : ఉపాధి కోసం దుబాయికి వెళ్లిన ఓ వ్యక్తి గుండెపోటుతో మృతిచెందగా గురువారం మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ మండలం కొత్తదాంరాజుపల్లి గ్రామానికి చెందిన కాసర్ల రాజరెడ్డి (58)కి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. రాజరెడ్డి కొన్ని రోజులుగా గల్ఫ్‌కు వెళ్లి వస్తున్నాడు. ఇద్దరు కుమార్తెలకు వివాహం జరిపించగా కొన్నిరోజుల క్రితం మళ్లీ దుబాయికి వెళ్లాడు. ఈ క్రమంలో మూడో కుమార్తెను కోరుట్లకు చెందిన ప్రశాంత్‌తో గతనెల 24న వివాహం జరిపించేందుకు కుటుంబ సభ్యులు నిశ్చయించారు. కొన్నిగంటల్లో వివాహం జరగనుండగా వరుడి తండ్రి గంగారాం గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో వివాహం ఆగిపోయి పెళ్లింటా విషాదం నెలకొంది. కుమార్తె వివాహం ఆగిపోవడంతో రాజరెడ్డి మనోవేదనకు గురయ్యాడు. ఈనెల 17న రాజరెడ్డి విధులు ముగించుకొని నిద్రకు ఉపక్రమించగా గుండెపోటుతో మృతిచెందాడు. రాజరెడ్డి మృతివిషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్థానిక నాయకుల సహకారంతో దుబాయిలోని ఎంబసీ అధికారులతో మాట్లాడారు. గల్ఫ్ జేఏసీ సహకారం, ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ ప్రత్యేక చొరవతో రాజరెడ్డి మృతదేహం గురువారం స్వగ్రామానికి చేరింది. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం


పూజలు చేస్తున్న పొన్నం ప్రభాకర్

ధర్మపురి: తెలంగాణ ఏర్పడితే లక్షల ఉద్యోగాలు వస్తాయని నమ్మిన విద్యార్థుల భవిష్యత్‌తో ప్రభుత్వం చెలగాటమాడుతుందని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయం పక్షాన స్వామివారి శేష వస్త్రం, ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఢిల్లీ లిక్కర్ స్కాంపై మంత్రులు మాట్లాడుతున్నారే తప్ప దీనిపై స్పందించడం లేదన్నారు. బీఆర్‌ఎస్ నాయకులకు బీజేపీ ప్రభుత్వం కొమ్ము కాస్తుందని దుయ్యబట్టారు. ఇటీవల వడగండ్ల వానతో దెబ్బతిన్న రైతాంగానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దినేష్, ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సింహరాజు ప్రసాద్, అశెట్టి శ్రీనివాస్ తదితరులున్నారు.

ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు

జగిత్యాలటౌన్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి బింగి సత్యమ్మ గురువారం ప్రకటనలో తెలిపారు. సుశిరా ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ఎల్‌ఎల్‌పీ కంపెనీలో 40 మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, 5 మేనేజర్ పోస్టులకు ఈనెల 25న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు ఉండి ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ ఆపై విద్యార్హతలు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని, ఎంపికయిన వారు హైదరాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుందని వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15,000 –18,000 వేతనం చెల్లించబడుతుందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని రెండో అంతస్తు రూం నంబర్ 218లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు జరిగే జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు.

జిల్లాలో నిలిచిన బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు

జగిత్యాలరూరల్: జిల్లాలో బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు బుధవారం రాత్రి నుంచి నిలిచిపోయాయి. దీంతో బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులు తమ ల్యాండ్ ఫోన్లతో పాటు సెల్‌ఫోన్లు పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఉన్న బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంతో సేవలు నిలిచిపోయాయని అధికారులు తెలిపారు.

లక్కీడ్రా ద్వారా ఎంపిక


డ్రా తీస్తున్న సంక్షేమాధికారి నరేశ్

జగిత్యాల: మైనార్టీ శాఖ ద్వారా ఆర్థిక సాయం పొందేందుకు అధిక సంఖ్యలో దరఖాస్తులు రావడంతో లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని సంక్షేమాధికారి బోనగిరి నరేశ్ తెలిపారు. అభ్యర్థుల సమక్షంలోనే లక్కీడ్రా తీశామని, 12 మంది జనరల్ కోటా, ఒకరిని దివ్యాంగుల కోటా కింద ఎంపిక చేశామన్నారు. వారికి రుణాలు అందించడం జరుగుతుందన్నారు.

ఇద్దరు ఎస్సైల బదిలీ

జగిత్యాలక్రైం: జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ ఎగ్గడి భాస్కర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సీసీఎస్ డీసీఆర్బీ అటాచ్డ్‌గా పనిచేస్తున్న ఎస్సై సందీప్‌ను జగిత్యాల టౌన్ పీఎస్‌కు, వీఆర్‌లో పనిచేస్తూ ఎస్సై–2గా మల్యాలలో విధులు నిర్వహిస్తున్న పురుషోత్తంను డీసీఆర్బీ జగిత్యాల ఎస్సైగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఐదుగురు కానిస్టేబుళ్లు..

జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఐదుగురు కానిస్టేబుళ్లను గురువారం బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఐదుగురిని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

వెబ్‌సైట్‌లో ఎస్సెస్సీ హాల్‌టికెట్లు

జగిత్యాల: ఎస్సెస్సీ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి హాల్‌టికెట్లు శుక్రవారం ఉదయం నుంచి WWW.BSETELANGANA.GOV.IN వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లపై ప్రధానోపాధ్యాయుల సంతకం లేకున్నా పరీక్షలకు అనుమతించబడతారని, పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ పరీక్ష కేంద్రానికి ఒకరోజు ముందు వెళ్లి అడ్రస్ సరిచూసుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. సకాలంలో పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

ఎస్సారెస్పీ కాలువలో గుర్తుతెలియని మృతదేహం

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి, చల్‌గల్ గ్రామ శివారు మధ్యలో డీ–53–3ఆర్ ఎస్సారెస్పీ కెనాల్‌లో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. పూర్తిగా కుళ్లిపోయి ఉంది. ఈమేరకు చల్‌గల్ గ్రామానికి చెందిన కాసారపు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు.

నేడు అవార్డుల ప్రదానం

ఇబ్రహీంపట్నం : మెట్‌పల్లిలోని వీఆర్‌ఎం గార్డెన్‌లో శుక్రవారం మధ్యాహ్నం దీన్‌దయాల్ ఉపాధ్యాయ పంచాయితీ సటక్ వికాస్ పురస్కార్ అవార్డులను ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అందజేస్తారని ఎంపీడీవో ప్రభు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

రంజాన్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి

- కలెక్టర్ యాస్మిన్ బాషా


మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాలక్రైం: రంజాన్ పండగను శాంతియుతంగా జరుపుకోవాలని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులు నమ్మొద్దని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. గురువారం ఎస్పీ భాస్కర్‌తో కలిసి ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో రంజాన్ ఏర్పాట్లపై పోలీసు, మున్సిపల్, వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రంజాన్ మాసంలో చేయాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఉపవాస దీక్షల సమయంలో మసీదుల వద్ద పరిశుభ్రంగా ఉండేలా శానిటేషన్ పనులు చేయాలని, తాగునీటి వసతులు కల్పించి, వీధిదీపాలు వెలిగేలా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ ఇబ్బందులు లేకుండా చూడాలని విద్యుత్ అధికారులకు సూచించారు. ఏదైనా సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, అన్ని కులాలు, మతాలవారు శాంతియుతంగా, ఆనందోత్సవాల మధ్య పండగలు జరుపుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మతసామరస్యానికి పాటుపడాలన్నారు. శాంతిభద్రతలు అదుపులో ఉంటేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. సమావేశంలో ఆర్డీవోలు మాధురి, వినోద్‌కుమార్, డీఎస్పీలు ప్రకాశ్, రవీందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను చెల్లించి అభివృద్ధికి తోడ్పడాలి

జగిత్యాల: ఆస్తిపన్ను చెల్లించి అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. గురువారం మున్సిపల్‌కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వందశాతం పన్నులు వసూలు చేయాలని, ప్రజలు సైతం సహకరించి చెల్లిస్తే పట్టణం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎక్కువ మొత్తంలో బకాయిలు ఉన్నవారిని గుర్తించి అవగాహన కల్పించాలని, ఒకేసారి పన్ను కట్టలేని యెడల పాక్షికంగా చెల్లించే వెసులుబాటు ఉందన్నారు. డిస్కౌంట్, వడ్డీ మాఫీ లాంటి అవకాశాలేమీ లేవని, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వందశాతం పన్నులు వసూలు కాకుంటే 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిపివేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, అదనపు కలెక్టర్ మకరంద్, కమిషనర్ నరేశ్ పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌లో తెలంగాణ నంబర్‌వన్


అవార్డులు స్వీకరించిన సర్పంచులు

జగిత్యాలరూరల్: స్వచ్ఛభారత్‌లో దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్ స్థానంలో నిలిచిందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. గురువారం జగిత్యాల నియోజకవర్గ స్థాయి జాతీయ పంచాయతీ అవార్డులు శుభమస్తు ఫంక్షన్‌హాల్‌లో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ 2023 అవార్డులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, ఇందులో తెలంగాణ మొదటిస్థానంలో నిలిచిందన్నారు. సీఎం కేసీఆర్ చేపట్టిన పల్లెప్రగతి ఫలాలతోనే ఈ అవార్డులు వచ్చాయన్నారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో అనేక అవార్డులు రావడం జరిగిందన్నారు. అవార్డులు రావడంలో జిల్లా అధికారులు ప్రధాన పాత్ర పోషించారని పేర్కొన్నారు. పల్లెప్రగతి గొప్ప కార్యక్రమాన్ని నేడు పల్లెలు పచ్చదనం, పరిశుభ్రతతో కళకళలాడుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీలు పాలెపు రాజేంద్రప్రసాద్, ములాసపు లక్ష్మి, లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ సంగెపు మహేశ్, ఎంపీడీవోలు రాజేశ్వరి, శైలజరాణి, సూపరింటెండెంట్ గంగాధర్, ఎంపీవో రవిబాబు, సర్పంచులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి కేంద్రం సహకరించిదెక్కడ?

సారంగాపూర్(జగిత్యాల): కేంద్ర ప్రభుత్వం వ్యవసాయరంగానికి ప్రోత్సహించిదెక్కడో చెప్పాలని జెడ్పీ చైర్‌పర్సన్ వసంత, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయంతోపాటు, 24 గంటల విద్యుత్ అందిస్తుంటే.. కేంద్ర ప్రభుత్వం కాంప్లెక్స్ ఎరువుల ధరలను నాలుగింతలు పెంచిందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని, ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సారంగాపూర్‌లో కల్యాణమండపాన్ని ప్రారంభించారు. కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, ఎంపీపీ కోల జమున, జెడ్పీటీసి మేడిపల్లి మనోహర్‌రెడ్డి, కొల్ముల రమణ, గుర్రాల రాజేందర్‌రెడ్డి, జోగినపల్లి సుధాకర్ రావు, సొల్లు సురేందర్, గుర్నాథం మల్లారెడ్డి, ఏలేటి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చివరి భూములకు నీరందేలా చూడాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్(జగిత్యాల): కాలువ చివరి భూములకు సాగునీరు చేరడానికి కాలువలపై నీటిపారుదల శాఖ అధికారుల నిరంతర పర్యవేక్షణ అవసరమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బట్టపల్లి గ్రామంలో మాట్లాడారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద ఉన్న డీ– 53, 12 ఎల్, 1ఆర్ కాలువ కింద బట్టపల్లి, పోతారం, సారంగాపూర్, రేచపల్లి గ్రామాలకు సాగునీరు ఆశించిన స్థాయిలో అందడానికి 1ఆర్‌పై అధికారుల నిరంతర పర్యవేక్షణ అవసరం అన్నారు. బట్టపల్లి గ్రామ శివారుల్లో ఇప్పటికే చాలా మంది రైతుల పొలాలు ఎండిపోయాయని, ఆన్ అండ్ ఆఫ్ విధానంలో అందించిన 5వ తడిలో ఆఖరు రెండు రోజులు నీటిని పొడగించడంతో నీరు బట్టపల్లి గ్రామ రైతులకు చేరిందన్నారు. ప్రస్తుతం వచ్చే 6వ తడిపై ఎక్కువ మొత్తంలో నీటిని విడుదల చేసి, చివరి ఆయకట్టుకు నీరు చేరడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ రాంచంద్రారెడ్డి, గంగారాం, కాలగిరి మధుసూదన్‌రెడ్డి, నలువాల వెంకన్న, గంగన్న, కట్ట ఆదర్శ్, దాసరి నర్సయ్య తదితరులు ఉన్నారు. కాగా బట్టపల్లిలో గుర్రం పోశయ్య మృతిచెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మర్రిపల్లి గంగయ్య అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతుండగా అతడిని పరామర్శించారు.

బడుగుల రిజర్వేషన్లకు తూట్లు పొడుస్తున్న బీఆర్‌ఎస్


మాట్లాడుతున్న గంగారాం

జగిత్యాలటౌన్: జగిత్యాల నియోజకవర్గంలో రాజకీయ పదవుల్లో బడుగుల రిజర్వేషన్లకు బీఆర్‌ఎస్ నాయకులు తూట్లు పొడుస్తున్నారని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కన్వీనర్ దుమాల గంగారాం ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. జగిత్యాల నియోజకవర్గంలోని అర్బన్, రూరల్ మండలాల ఎంపీపీ పదవులు ఎస్సీ, బీసీలకు రిజర్వు కాగా ఇరువురూ కరోనాతో మృతి చెందారని గుర్తు చేశారు. ఇరువులు ఎంపీపీల స్థానంలో ఇన్‌చార్జీల పాలన సాగిస్తూ రిజర్వేషన్లకు తూట్లు పొడుస్తున్నారని పేర్కొన్నారు. ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో ఇతరులను కూర్చోబెట్టి బాబాసాహెబ్ కల్పించిన రిజర్వేషన్ ఫలాలు బడుగులకు అందకుండా చేస్తున్నారని ఆరోపించారు. అలాగే స్థానిక మున్సిపల్ చైర్మన్‌గా ఇటీవల బీసీ మహిళ పదవి నుంచి వైదొలగగా మరో బీసీ మహిళను నియమించకుండా మహిళా రిజర్వేషన్‌కు తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. బడుగుల రిజర్వేషన్లు సక్రమంగా అమలయ్యేందుకు, బీఆర్‌ఎస్ నియంతృత్వ పాలనకు చరమగీతం పాడేందుకు బడుగు బిడ్డలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట నాయకులు సతీష్, శ్రీను, దీకొండ మహేందర్, చిర్ర లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించాలి


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్ : ఇటీవల కురిసిన వడగళ్లతో దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో గురువారం అదనపు కలెక్టర్ బీఎస్ లతకు వినతిపత్రం అందజేశారు. అనంతరం గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి ఎకరాకు 50వేలు, పాక్షికంగా నష్టపోయిన పంటలకు 25వేల పరిహారం అందించాలని కోరారు. ఫసల్‌భీమా యోజనను అమలు చేసి రైతులకు అండగా నిలవాలన్నారు. ఆయన వెంట కిసాన్‌మోర్చా నాయకులు కర్నె నర్సింహరెడ్డి, హన్మంతరావు, తిరుపతి, వీరబత్తిని అనిల్‌కుమార్, క్యాతం దశరథ రెడ్డి, మదన్మోహన్, రాగిళ్ల సత్యనారాయణ, బాపురెడ్డి, మహేశ్, శంకర్, రాజేశ్, తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఒకరికి జరిమానా

జగిత్యాల జోన్ : విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఒకరికి రూ.19,242 జరిమానా విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు జిల్లా జడ్జి వీరయ్య గురువారం తీర్పుచెప్పారు. ట్రాన్స్‌కో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి తెలిపిన వివరాల ప్రకారం... వెల్గటూర్ మండలం గొడిశెలపేట గ్రామానికి చెందిన మేరుగు సత్తయ్య జూన్ 12, 2016న తన ఇంటికి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తుండగా అధికారులు పట్టుకొని విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మొదటి తప్పుగా భావించి రూ.వెయ్యి జరిమానా విధించారు. ఫిబ్రవరి 6, 2017న మరోసారి అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తుండగా అధికారులకు ఫిర్యాదు చేశారు. సత్తయ్యపై కేసునమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన అనంతరం సత్తయ్యకు రూ.19,242 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పుచెప్పారు. జరిమానా చెల్లించకపోతే రెండునెలల సాధారణ జైలుశిక్ష ఉంటుందన్నారు.